క్లుప్తంగా

రేపటి నుంచి పోలకల్లో ఉరుసు



శ్రీ హజరత్ షేక్‌షావలి సాహెబ్ దర్గా

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో గురువారం నుంచి శ్రీ హజరత్ షేక్‌షావలి సాహెబ్ ఉరుసు ఉత్సావాలు ప్రారంభం కానున్నాయని నిర్వాహకులు తెలిపారు. 55వ ఉరుసు కార్యక్రమంలో భాగంగా గురువారం గంధం, శుక్రవారం ఉరుసు, శని వారం కిస్తీ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ మేరకు దర్గాను సుందరంగా అలంకరించారు.

ఆడుదాం..ఆంధ్ర పోటీలను జయప్రదం చేయండి

కోడుమూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం..ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా బుధవారం నుంచి మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. కోడుమూరులోని బాలుర హైస్కూల్ మైదానంలో జరిగే మండల స్థాయి పోటీల్లో ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో ఎంపికైన క్రీడాకారులు పాల్గొని జయప్రదం చేయాలని ఎంపీడీఓ పిలుపునిచ్చారు.

నేటి నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు



క్రీడా పోటీల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు, పీడీ, పీఈటీలు

సి.బెళగల్: మండలం కేంద్రం సి.బెళగల్‌లో బుధవారం నుంచి మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం క్రీడాపోటీలు నిర్వహించే సి.బెళగల్ జెడ్పీహెచ్ హైస్కూల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల క్రీడా మైదానాలను పీడీ, పీఈటీలతో కలిసి ఎంపీడీఓ పరిశీలించారు. మొదటి రోజు కబడ్డీ పోటీలను నిర్వహించడం జరుగుతందని క్రీడల నిర్వహణాధికారి, కొత్తకోట జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత



పింజరి మిన్నెమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ చక్రవర్తి

సి.బెళగల్: మండలంలోని బురాన్‌దొడ్డికి చెందిన పింఛన్ లబ్ధిదారు రాలు పింజరి మిన్నెమ్మ అనారోగ్యంతో కర్నూలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ చక్రవర్తి కర్నూలు ఆసుపత్రికి వెళ్లి పింజరి మిన్నెమ్మకు పెంచిన పింఛన్ రూ. 3 వేలను అందజేశారు. వలంటీర్‌ను మిన్నెమ్మ కుటుంబ సభ్యులతో ఆసుపత్రి సిబ్బంది అభినందనలు తెలిపారు.

మహాసభ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

గూడూరు: ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర 13వ మహా సభలు ఈ నెల 20, 21 తేదీలలో మంగళగిరిలో నిర్వహిస్తున్నట్లు చేనేత సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.మాధవస్వామి తెలిపారు. మంగళవారం పట్టణంలో వారు మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న కష్టాలపై మహా సభలో వక్తలు మాట్లాడుతారని, కార్మికులు తరలి రావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నాయకులు టి.శ్రీనివాసులు, కే.గోవిందు, కే.వెంకటేష్, కే.ఎల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్ర విజయవంతం చేయండి

పాణ్యం: ఈనెల 15న నిర్వహించే వికసిత్ సంకల్పయాత్రను విజయవంతం చేయాలని శ్రీశైలం ఐటీడీఏ పీవో రవీంద్రారెడ్డి అన్నారు. మండల పరిధిలోని బలపనూరులోని ట్రైబల్ స్కూల్ పరిసరాలను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశమయ్యారు. గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి జాన్‌జాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ సందర్భంగా ప్రధాన మంత్రితో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమం నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సలోమి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి బాట

- ప్రజా సంకల్ప యాత్ర చరిత్రాత్మకం
- జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య
- పార్టీ కార్యాలయంలో ఘనంగా వేడుకలు
- కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



వైఎస్‌ఆర్ సర్కిల్ వద్ద కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులను తినిపిస్తున్న కేడీసీసీబీ చైర్‌పర్సన్ విజయమనోహరి

కర్నూలు టౌన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల క్రితం చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర ప్రజా సంక్షేమానికి బాట వేసిందని జిల్లా వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య అన్నారు. ప్రజా సంకల్పయాత్ర చేపట్టి నేటికి ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం వేడుకలు నిర్వహించారు. స్థానిక బిర్లా కాంపౌండ్‌లో ఉన్న జిల్లా పార్టీ కార్యాలయంలో దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పార్టీశ్రేణులకు పంచారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలు నష్టపోయాయయన్నారు. ప్రజా క్షేమాన్ని కోరుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిపక్షనేతగా 2017 డిసెంబర్ 6 వ తేదీ కడప జిల్లా ఇడుపుల పాయ నుంచి ప్రజా సంకల్ప యాత్ర ప్రారంభించారన్నారు. నాడు అధికార తెలుగుదేశం పార్టీ యాత్రకు ఇబ్బందులు కలిగించినా వెనుకడుగు వేయకుండా 341 రోజులు పాదయాత్ర చేశారన్నారు. ఆ సమయంలో ప్రజల కష్టాలు స్వయంగా తెలుసుకొని అధికారంలోకి రాగానే వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారన్నారు. నాడు ఇచ్చిన ప్రతి హామీని ఈ నాలుగున్నరేళ్ల పాలనలో పూర్తిగా అమలు చేశారని చెప్పారు. ఇచ్చిన మాట మీద నిలబడే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సర్కారును రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపించుకుందామని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్‌పర్సన్ విజయమనోహరి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్‌చంద్రబోస్, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి పుల్లా రెడ్డి, పార్టీ బీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మద్దయ్య, నగర అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి నాగేశ్వరి, పార్టీ యువజన విభాగం ఉపాధ్యక్షుడు శివారెడ్డి, సంయుక్త కార్యదర్శి సాయి, ఎస్సీ సెల్ శివ, కటారి సురేష్ పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ సర్కిల్ వద్ద ..

ప్రజా సంకల్పయాత్ర చేపట్టి ఐదేళ్లు పూర్తి అయిన సందర్భంగా కర్నూలు నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్పొరేటర్లు స్థానిక వైఎస్‌ఆర్ సర్కిల్ వద్ద సంబరాలు చేసుకున్నారు. వైఎస్‌ఆర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారీ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ బీవై రామయ్య పాల్గొని మాట్లాడారు. పార్టీ నగర అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, గోశాల చైర్మన్ ఆదిమోహన్‌రెడ్డి, రైల్వే ప్రసాద్, కార్పొరేటర్లు నగరూరు శ్రీనివాసరావు, షేక్ యూనస్‌బాషా, షేక్ అహమ్మద్, రాజేశ్వర రెడ్డి, ఫరాజ్‌ఖాన్, షాషావలి, వైఎస్‌ఆర్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కేధర్‌నాథ్, నాయకులు కరుణాకర్‌రెడ్డి, కోఆప్షన్ మెంబరు నయిమ్‌బాషా, జిల్లా యూత్ అధ్యక్షుడు సితార ఇర్ఫాన్, నవీన్, బెస్త నవీన్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంతకు ముందు ఈనెల 19 వ తేదీన విజయవాడలో జరిగే 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం పోస్టర్లు వారు విడుదల చేశారు.

ప్రజలు జగనన్న వైపే

ప్రజాక్షేత్రంలో గెలుపు ఎల్లప్పుడు జగనన్న వైపే అని జిల్లా కేంద్ర సహకారా బ్యాంకు చైర్‌పర్సన్ విజయ మనోహరి అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక వైఎస్‌ఆర్ సర్కిల్ వద్ద దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్‌ఆర్ కాంస్య విగ్రహానికి పార్టీ నాయకులతో కలిసి పూలమాలలు వేశారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి పెద్దపీట వేశారని కల్లూరు అర్బన్ 29వ వార్డు కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. ప్రజా సంకల్ప యాత్ర ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం కల్లూరు అర్బన్ శరీన్‌నగర్‌లోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులకు ఇంటి వద్దే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి నాయకత్వంలో కల్లూరు అర్బన్‌లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి, నాయకులు నాగమద్దిలేటి, శివారెడ్డి, హుస్సేన్ ఆలం, బాష, హేమలత, కృష్ణారెడ్డి, భూపాల్‌రెడ్డి, గంగన్న, సాయి, వార్డు సచివాలయాల కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహావిష్కరణ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మేయర్ బీవై రామయ్య, వైఎస్‌ఆర్‌సీపీ నాయికులు



శరీన్‌నగర్‌లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

చరిత్రాత్మకం ప్రజాసంకల్ప యాత్ర

కోడుమూరు: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్రలో భాగంగా నిర్వహించిన పాదయాత్ర చారిత్రాత్మకమని కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి అన్నారు. సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్ర ఐదేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం కోడుమూరులోని కోట్ల హర్ష యూత్ కార్యాలయంలో జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రజాసంకల్పయాత్రలో భాగంగా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెరవేర్చి ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేశారన్నారు. జగనన్న అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో రాష్ట్ర ప్రజలంతా సంతోషంగా జీవిస్తున్నారన్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీని ఆశీర్వాదించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మాదులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, స్థానిక నాయకులు మల్లారెడ్డి, తేనేశ్వరరెడ్డి, బైస్‌దొడ్డి హనుమంతు, రవికుమార్‌రెడ్డి, ప్రసాద్, రాఘవేంద్ర, లింగమూర్తి, గోపి, ప్రభాకర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



కోడుమూరులో కేక్ కట్ చేస్తున్న రఘునాథ్‌రెడ్డి

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

కర్నూలు (సిటీ) : రానున్న ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, ఓటర్లు స్వేచ్ఛాయుత, వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని సెక్టార్ అధికారులకు కోడుమూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్‌డీఓ హరిప్రసాద్ సూచించారు. మంగళవారం కర్నూలు మండల పరిషత్ వనరుల కేంద్రంలో సెక్టార్ ఆఫీసర్, సెక్టార్ పోలీసు అధికారులకు సాధారణ ఎన్నికల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, కర్నూలు, కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్‌లలో కనీస సౌకర్యాలు ఉన్నాయో లేదో పరిశీలించాలని సూచించారు. వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక ర్యాంప్‌లు ఏర్పాటు చేయాలని చెప్పారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌డీఓ హరిప్రసాద్

వేతనాలు పెంచే వరకు సమ్మె కొనసాగిస్తాం

కర్నూలు(సెంట్రల్): వేతనాలు పెంచే వరకు సమ్మె ఆపేదిలేదని అంగన్‌వాడీలు పేర్కొన్నారు. 29వ రోజు శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. సమ్మెలో భాగంగా 24 గంటల నిరాహార దీక్షలను సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, అంజిబాబు, ఎస్ మునెప్ప, చంద్రశేఖర్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు ప్రారంభించారు. ఈ దీక్షలకు 200 మంది మార్కెట్ యార్డు కార్మికులు మద్దతు తెలిపారు.

కలెక్టరేట్‌ను ముట్టడించిన కార్మిక సంఘాల నాయకులు

అంగన్‌వాడీలకు ఇచ్చిన ఎస్మా చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడించారు. జీతాలు పెంచమని అడిగితే ఉద్యోగాలు తీసి వేస్తామని అంగన్‌వాడీలను ప్రభుత్వం హెచ్చరించడం సరికాదని ఆయా సంఘాల నాయకులు రాధాకృష్ణ, అంజిబాబు, ఎస్ మునెప్ప, చంద్రశేఖర్, నరసింహులు అన్నారు. అయితే, కార్మిక సంఘాల నాయకులు కలెక్టరేట్‌లోకి దూసుకుపోవడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

రైతువాణి క్యాలెండర్ ఆవిష్కరణ

కర్నూలు(సెంట్రల్): ఏపీ రైతు సంఘం రూపొందించిన రైతు వాణి క్యాలెండర్‌ను డీఆర్వో కె.మధుసూదన్‌రావు ఆవిష్కరించారు. మంగళవారం డీఆర్వో కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, నాయకులు జి.ఆంజనేయులు, మధుసూదన్, మాసం బాష పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి...

కర్నూలు మండలం నూతనపల్లె సమీపంలో జరుగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనులతో వస్తున్న దుమ్ముతో సమీప పంట పొలాలన్నీ దెబ్బతిని చేతికి రావడంలేదని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ ఆవేదన వ్యక్తంచేశారు. నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ రైతులకు పరిహారం ఇవ్వాలని లేదంటే పంటలు లే నిసమయంలో పనులు చేసుకోవాలని సూచించారు.

ఆర్‌యూ హాస్టళ్లలో సౌకర్యాలు మెరుగు పరుస్తాం

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలోని హాస్టళ్లలో సౌకర్యాలు మెరుగు పరుస్తామని వర్సిటీ ఇన్‌చార్జ్, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎ. ఫజులుర్ రెహమాన్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం వర్సిటీలోని అనుబంధ హాస్టళ్లను తనిఖీ చేశారు. అక్కడ ఉన్న సౌకర్యాలపై విద్యార్థులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్సిటీలో నీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా హాస్టళ్లను నిర్వహించాలని ఆదేశించారు. వీసీ వెంట వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుందరానంద పుచ్చ, హాస్టళ్ల వార్డున్లు, డిప్యూటీ వార్డెన్లు ఉన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే క్రీడా పోటీలు

- నేటి నుంచి మండల స్థాయిలో ఆడుదాం-ఆంధ్ర పోటీలు ప్రారంభం
- ఓర్వకల్లు ఎంపీడీఓ శివనాగ ప్రసాద్



పాఠశాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శివనాగప్రసాద్

ఓర్వకల్లు: ప్రతిభావంతులైన గ్రామీణ క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆడుదాం..ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివనాగ ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోటీలకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ (బుధవారం) నుంచి 23వ తేదీ వరకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5 క్రీడాంశాల్లో స్త్రీ, పురుషులకు వేర్వేరుగా పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పకడ్బందీగా జరుగుతున్నాయన్నారు. క్రీడామైదానంలో కటౌట్లు, ఫ్లకార్డులు, ఆడుదాం..ఆంధ్ర జెండాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మండల స్థాయిలో గెలుపొందిన జట్లను నియోజకవర్గ స్థాయికి పంపడం జరుగుతుందని పేర్కొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహక బహుమతులు

ఆడుదాం-ఆంధ్ర క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు నియోజకవర్గ స్థాయి నుంచి నగదు బహుమతితో పాటు, మెమొంటో, ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. ఇందులో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్ పోటీలలో గెలుపొందిన జట్లకు నియోజకవర్గ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు రూ.35 వేలు, రూ.15 వేలు, రూ.5 వేలు, జిల్లాస్థాయిలో గెలుపొందిన జట్లకు వరుసగా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.10 వేలు, రాష్ట్రస్థాయి పోటీలకు వరుసగా రూ.5 లక్షలు, రూ.3 లక్షలు, రూ.2 లక్షల చొప్పున నగదు బహుమతులు అందజేస్తారని వెల్లడించారు.

బ్యాడ్మింటన్ పోటీల విజేతలకు..

ఆడుదాం- ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా బ్యాడ్మింటన్ విభాగంలో గెలుపొందిన జట్లకు నియోజవర్గస్థాయిలో వరుసగా రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, జిల్లాస్థాయిలో గెలుపొందిన జట్లకు రూ.35 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రాష్ట్రస్థాయిలో గెలుపొందిన జట్లకు రూ. 2 లక్షలు, రూ.1 లక్ష, రూ.50 వేల చొప్పున బహుమతులు ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రజల చెంతకే వైద్య సేవలు

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కల్లూరు: జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం వైద్యసేలను ప్రజల చెంతకే తీసుకెళ్తుందని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ రామగిడ్డయ్య అన్నారు. మంగళవారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నాయకల్లు గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలను ఆయన పరిశీలించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమానికి వచ్చిన వారందరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఏవైనా తీవ్ర సమస్యలు ఉంటే ఆస్పత్రులకు రెఫర్ చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో పంచాయతీ సిబ్బందితో సమన్వయం చేసుకుని పరిసరాల పరిశుభ్రతపై ప్రజలను అవగాహన కల్పించాలని ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సి.బెళగల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది. మండల కేంద్రం సి.బెళగల్‌లోని గ్రామ సచివాలయం - 1 పరిధిలో మండల అధికారులు, వైద్యులు జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత హెల్త్ క్యాంప్ నిర్వహించారు. వైద్యులు ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 362 మంది వైద్య సేవలను అందించినట్లు క్యాంపు నిర్వహణ అధికారి, డాక్టర్ మిథున్‌కుమార్‌రెడ్డి తెలిపారు. హెల్త్ క్యాంప్‌ను సర్పంచ్ పాండురంగన్న సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అదేవిధంగా హెల్త్ క్యాంప్‌ను జిల్లా మలేరియా అధికారి నూకరాజు తనిఖీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అభిషేకం, డాక్టర్లు ఫాతిమాషాకీర్, సింధూర, కంటి వ్యాధి నిపుణుడు సంపత్, వైద్య అధికారులు ఉమామహేశ్వరి, మంగమ్మ, మద్దిలేటి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు రూరల్: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై దృష్టి సారించి సంరక్షించుకోవాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ నూకరాజు సూచించారు. జూలకల్‌లో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందజేసేందుకు రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్షను చేపట్టిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానికంగా ఉన్న 400 మంది ప్రజలు వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాముడు, డాక్టర్లు శ్రావణి, శిఆవని, వినయ్, గ్రామ పెద్దలు లక్ష్మికాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నాయకల్లులో ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య



మహిళకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సింధూర



మహిళలకు బీపీ పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది



ప్రజలతో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి నూకరాజు

చంద్రబాబు అబద్ధాల కోరు

గడివేముల: టీడీపీ అధినేత చంద్రబాబు అబద్ధాల కోరు అని నంద్యాల జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు శిరుప శ్రీనివాసరెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కాదు అని ఆయన ప్రజలకు చేయబోయే మోసానికి అని విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారం కోసం టీడీపీ అధినేత ఆళ్లగడ సభలో మాయమాటలు చెబుతున్నారని మండిపడ్డారు. రైతులకు సాగు నీరు అందడం లేదని అబద్ధాలు చెబుతున్నారన్నారు. ఆయన ఎన్ని కుట్రలు పన్నినా 2024లో వైఎస్సార్‌సీపీదే గెలుపు అని అన్నారు.

దరఖాస్తు చేసుకోండి

గడివేముల: కొర్రపోలూరు గ్రామంలో శ్రీ రామలింగేశ్వర, చెన్నకేశవ, ఆంజనేయ, లింగమయ్య స్వామి దేవాలయాలకు నూతనంగా ధర్మకర్త మండలి ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని ఈఓ మోహన్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ఆసక్తి గల సభ్యులు ఈ నెల 25 వ తేదీ లోపల నంద్యాల జిల్లా దేవదాయశాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక ఈఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

సుప్రీం తీర్పు చరిత్రాత్మకం

కర్నూలు(సెంట్రల్) : గుజరాత్‌కు సంబంధించిన బిల్కిస్ బానో కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని ఐద్వా జిల్లా కార్యదర్శి ఆలివేలు, అవాజ్ కమిటీ నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్‌హుస్సేన్, షేక్ మహ్మద్ షరీఫ్ మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. 2002లో 14 మందిని చంపిన కేసులో నిందితులకు కోర్టులు యావజ్జీవ శిక్షను ఖరారు చేశాయన్నారు. అయితే ప్రస్తుత గుజరాత్ ప్రభుత్వం ఆ శిక్షను 11 ఏళ్లకు తగ్గించి నిందితులను విడుదల చేసిందన్నారు. దీనిపై సుప్రీం కోర్టు కలగజేసుకొని నిందితులు జైలు కు వెళ్లేలా తీర్పు ఇవ్వడం హర్షణీయమన్నారు.

పుస్తకపఠనంతో విషయావగాహన

కర్నూలు కల్చరల్: పుస్తకాలు చదవడం మంచి అలవాటని ప్రముఖ వైద్యులు శంకర్ శర్మ అన్నారు. మంగళవారం బీక్యాంప్‌లోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు నడిచెనమెట్ల శేషఫణి శర్మ రచించిన 'పిల్లల కోసం - మీకోసం కూడా ' పుస్తకావిష్కరణ జరిగింది. శంకర్ శర్మ, రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య అతిథులుగా హాజరై ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

తూకాల్లో మోసం చేస్తే చర్యలు

కర్నూలు (న్యూటౌన్): వ్యాపారులు ముద్రలేని తూకాలను వినియోగిస్తూ ప్రజలను మోసగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ పరమేశ్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం కర్నూలు నగరంలోని వివిధ షాపుల్లో వినియోగిస్తున్న ఎలక్ట్రానిక్ కాటాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నగరంలో 40 షాపుల్లో ఎలక్ట్రానిక్ కాటాలను తనిఖీ చేశామని, ఇందులో 6 షాపుల్లో ముద్రలేని ఎలక్ట్రానిక్ కాటాలు వినియోగిస్తుండడంతో రూ.1600 జరిమానా విధించామన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కర్నూలు కల్చరల్: కర్నూలు మండల ప్రజా పరిషత్తు సర్వ సభ్య సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీపీ సమావేశం మందిరంలో నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆజంఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల అధ్యక్షుడు వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండల పరిషత్ ప్రత్యేక అధికారి+, కర్నూలు పార్లమెంట్ సభ్యులు, కోడుమూరు శాసన సభ్యులు డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

అయోధ్యరాముని అక్షింతల పంపిణీ

కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని పలు కాలనీల్లో శ్రీరామ జన్మ భూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటింటా అయోధ్య రాముని అక్షింతలను పంపిణీ చేశారు. అయోధ్య రామ మందిర పోస్టర్లను ఆవిష్కరించారు. వీహెచ్‌పీ నగ ర కార్యదర్శి నాగరాజు, నాయకులు మహేష్, మల్లి, రఘు, వంశీ, కిషోర్, చందు, హరి, శ్రావణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- కేంద్ర ఆరోగ్యసహాయ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్

కర్నూలు(సెంట్రల్): దేశంలోని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్ష్యమని, అందుకోసమే వికసిత్ భారత్ సంకల్ప యాత్రలు నిర్వహిస్తున్నట్లు కేంద్ర ఆరోగ్యసహాయ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ తెలిపారు. మంగళవారం కర్నూలు రూరల్ మండలంలోని గార్గేయపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పౌరసరఫరాలు, వ్యవసాయం, వైద్యారోగ్యం, మహిళా శిశు సంక్షేమ శాఖలతోపాటు బ్యాంకులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం మరో ఐదేళ్లపాటు ప్రధానమంత్రి గరీబ్ కల్యాన్ అన్న యోజన పథకం కింద పేదలకు ఉచిత బియ్యాన్ని పంపిణీ చేస్తుందన్నారు. గ్యాస్ లేని మహిళలకు ఉచితంగా ఉజ్వల పథకం కింద గ్యాస్ కనెక్షన్ ఇస్తున్నట్లు చెప్పారు. ఆయుష్మాన్ భారత పథకంలో రూ.5 లక్షల వరకు పేదలకు ఆరోగ్య భరోసా కలిపించనున్నట్లు చెప్పారు. జన ఔషధి కింద తక్కువ ధరకు మందులను అందించనున్నట్లు చెప్పారు. రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు ఇచ్చి వారికి కావాల్సిన మందులను సబ్సిడీపై పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏదైనా కారణం చేత సంక్షేమపథకాలు అందకపోతే వికసిత భారత్ సంకల్ప యాత్రల్లో లబ్ధిదారులుగా నమోదు కావచ్చన్నారు. అనంతరం వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులతో ముచ్చటించారు. జేసీ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాదు, గ్రామసర్పంచ్ సోమేశ్వరమ్మ, బీజేపీ నాయకులు ప్రేమకుమార్, గోపాల్, వినూషరెడ్డి, సాయిప్రదీప్, రామస్వామి, కర్నూలు తహశీల్దార్ శివరాం పాల్గొన్నారు.



ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తున్న కేంద్ర సహాయ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్